ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన

అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఎండీ గౌతమ్

కొడంగల్, మే 6: మండలంలోని హుస్సేన్‌పూర్, కొడంగల్ మున్సిపల్‌తో పాటు దుద్యాల మండలంలోని సంగాయిపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను హౌసింగ్ ఎండీ వీపీ గౌతమ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాతో పాటు ఇందిరమ్మ కమిటీలచే ప్రతిపాదించబడ్డ ఇండ్ల దరఖాస్తు దారుల అర్హతలపై ఆరా తీశారు. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి మాడల్ హౌస్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ సుధీర్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, కొడంగల్, దుద్యాల తహసీల్దార్‌లు విజయ్‌కుమార్, మహేశ్, ఎంపీడీవో ఉషశ్రీ, డిప్యూటీ ఈఈ హౌసింగ్ చందర్‌నాయక్, సిరాజుద్దిన్, మున్సిపల్ కమీషనర్ బలరాం నాయక్ పాల్గొన్నారు.

ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ

పరిగి, మే 6: పరిగి మండలం రంగాపూర్‌లోని శ్రీ సత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యంలో 75 రోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. 55 మంది మహిళలు కుట్టు శిక్షణ పూర్తి చేసుకోగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి మాధవిలత మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి నాయకులు కె.నాగరాజు, ప్రభాకర్, జిల్లా మహిళా ఇన్‌చార్జీ విద్యారాణి, మహిళలు పాల్గొన్నారు.

అధిక రసాయనాలు వాడితే అనర్థాలే

రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

కొడంగల్, మే 6: అధిక రసాయనాలు వాడడం వల్ల నేల దెబ్బతింటుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్, తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పర్సాపూర్ రైతువేదికలో వ్యవసాయ పరిశోధన కేంద్ర తాండూరు, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారు వ్యవసాయంపై రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. అధిక యూరియా వాడకం వల్ల ఖర్చులు పెరుగుతాయని, రాను రాను భూసారంలో మార్పులు ఏర్పడి దిగుబడి తగ్గుతుందన్నారు. కాబట్టి రైతులు అవసరం మేరకు ఎరువులు వాడుకోవాలని, యూరియా వాడకాన్ని చాలా వరకు తగ్గించాలని సూచించారు. సేంద్రీయ ఎరువుల వాడకం ఎంతే మేలని నేలతో పాటు ప్రకృతిని కాపాడుకోవచ్చని తెలిపారు. ఏడీఏ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ పంట మార్పిడి విధానాన్ని తప్పక పాటించాలని పంట మార్పిడి వల్ల భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ పాల్గొన్నారు.

టార్పాలిన్ కవర్లు అదనంగా అందిస్తాం



వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శశిధర్‌రాజు

యాలాల్, మే 6: వర్షం పడ్డప్పుడు రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని రక్షించుకోవడానికి ఉపయోగించే టార్పాలిన్ కవర్లను అదనంగా సమకూర్చనున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శశిధర్ రాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బెన్నూరు, మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను డీసీఎస్‌వో మోహన్‌బాబు, డీఎం మోహన కృష్ణ, డీటీఎస్ శ్రీనివాస్ గౌడ్, గణపతి, ఇన్‌స్పెక్టర్ అజయ్ బాబు ఇతర సిబ్బందితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పంటను పూర్తిగా ఆరబెట్టిన తర్వాత సెంటర్లకు తీసుకురావాలన్నారు. అంతకు ముందు రైతులతో కలసి తూకాన్ని పరిశీలించారు. తూకం చేసి ఉంచిన బస్తాలలో కొన్నింటిని మళ్లీ తూకం వేయించి బరువును పరిశీలించారు. తేమ శాతాన్ని పరిశీలించి పూర్తిగా ధాన్యం ఆరబెట్టె విధానాన్ని రైతులకు వివరించారు.

రాజీతో కేసులను పరిష్కరించుకోండి

కొడంగల్, మే 6 రాజీతో కేసులు పరిష్కరించుకునే అవకాశం లోక్‌అదాలత్ కల్పించిందని, సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు జూన్ 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేకంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.5లక్షల లోపు ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయిన వాటికి సంబంధించి కేసులు నమోదు కావడం జరిగిందన్నారు. ఈ కేసుల పరిష్కారంలో భాగంగా ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇరు వర్గాల అంగీకారం ప్రకారం కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకులకు సంబంధించి చెక్ బౌన్స్ కేసుల్లో కూడా రాజీ కుదుర్చుకోవచ్చని తెలిపారు. రాజీ మార్గంలో ఇరువర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. జూన్ 14వ తేదన జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు.

హద్దురాళ్లు పగులగొట్టిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

తాండూరు రూరల్, మే6: పొలం హద్దు రాళ్లు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని తాండూరు మండలం, గౌతాపూర్ కు చెందిన కె.భీమమ్మ మంగళవారం కరణ్‌కోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండల పరిధిలోని గోపన్‌పల్లి గ్రామ శివారులో సర్వేనెం.1/అ2లో 1.04 ఎకరాల భూమి ఉంది. పడమర వైపు ఉన్న కదీర్ హుస్సేన్ అనే వ్యక్తి తమ పొలంలో పాతిన కడీలను దౌర్జన్యంగా తొలగించాడు. అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

కంకర వేశారు.. బీటీ మరిచారు

■ బీఆర్ఎస్ హయాంలో రూ. కోటి నిధులు ■ అర్ధాంతంగా నిలిచిన పనులు

పూడూరు, మే 6: పూడూరు మండల కేంద్రం నుంచి పూడూరు పంచాయతీ అనుబంధ గ్రామమైన మైసమ్మగడ తండా వరకు రోడ్డుపై కంకర పరచి సంవత్సరం కావస్తున్నా బీటీ రోడ్డు మాత్రం నిర్మించడం లేదు. వర్షకాలం వచ్చిందంటే గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం కోసం సుమారు రూ. కోటికిపై నిధులు మంజూరు చేయగా అంతలోనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల అనంతరం కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి నూతనంగా కంకర వేశారు. రోడ్డు నిర్మాణం పనులు జరిగితే తమ గ్రామానికి రాకపోకలు సక్రమంగా జరుగుతాయని గ్రామస్తులు సంతోషించారు. కానీ సంవత్సరం గడుస్తున్నా కంకరరోడ్డే దర్శనమిస్తున్నది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమా లేదా అధికారుల నిర్లక్ష్యమో కాని రోడ్డు పనులు మాత్రం అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డుపై కంకర వేసి వదిలేయడంలో కంకర రాళ్లు టైర్లకు తగిలి పంచర్ అవుతున్నాయని పలువురు వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షకాలం వస్తే మాత్రం కురిసే వర్షాలకు గుంతలమైయంగా మారి ఇబ్బందులు తప్పవని ఇరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైసమ్మగడ తండాలో మురుగుకాల్వల నిర్మాణం సైతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే హైదరాబాద్– బీజాపూర్ హైవే రోడ్డు నుంచి మండల కేంద్రానికి రావాలంటే గుంతలమయమైన రోడ్డుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు మండల కేంద్రంలోని పలు కార్యాలయాలకు వారివారి పని నిమిత్తం వస్తువుంటారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు జరగడంలేదనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమౌ తున్నాయి. ఇప్పటికైనా మైసమ్మగడతండా రోడ్డు నిర్మాణంతో పాటు మండల కేంద్రానికి డబుల్ నిర్మాణం చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి

ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే హైవే రోడ్డు నుంచి మండల కేంద్రానికి, పూడూరు నుంచి మైసమ్మగడ తండా రోడ్డు నిర్మాణం జరగడంలేదు. పూడూరు గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామ మైన మైసమ్మగడ్డ తండాకు రోడ్డు నిర్మాణంకై గతంలో ఉన్న రోడ్డును తవ్వి నూతనంగా కంకరపరిచి వదిలేశారు. అర్ధాంతరంగా కాం ట్రాక్టర్ రోడ్డు పనులను నిలిపివే యడంతో ఇబ్బందులు పడుతు న్నాం. వర్షాకాలం వచ్చిందంటే గ్రామం నుంచి మండల కేంద్రానికి రావాలంటే వాహనదారులు అవస్థపడక తప్పదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, అధికారులు రోడ్ల నిర్మాణం జరిగేలా దృష్టి పెట్టాలి.

–కె.హరీశ్వర్‌రెడ్డి, పూడూరు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఒకరినొకరు పలుకరించుకుని బాగోగులు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుదర్శన్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, మధు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు – మర్పల్లి మే 6

పాకిస్థాన్ పౌరులను వారి దేశానికి పంపించాలి

వికారాబాద్, మే 6 : అక్రమంగా జిల్లాలో ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్ పౌరులను వారివారి దేశాలకు పంపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదా నందా రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు పార్ల మెంట్ కో–కన్వీనర్ అమరేందర్‌రెడ్డి వికారాబాద్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు నరోత్తమ్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కులకచర్ల: భారత్‌లో నివసిస్తున్న పాకిస్థానీయులను వెంటనే భారత్ నుంచి పంపించి వేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ ఆధ్వర్యంలో డిప్యూటీతహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సెంట్రల్ టెలికాం సభ్యుడు వెంకటయ్య గౌడ్, నాయకులు కాటన్‌పల్లి అంజిలయ్య, దిశా కమిటి సభ్యుడు జానకీరాం, ప్రధాన కార్యదర్శులు పోమాల నరేశ్, పెరిమల్ల వెంకటేశ్, నాయకులు మహేశ్, కాట్రావత్ మహేశ్, మండల కార్యదర్శి మల్లేశం, గాదెమల్లేశ్, హన్మంతు, శివసంతోశ్, మల్లేశ్, ప్రశాంత్, సాయిలు పాల్గొన్నారు.

దోమ: దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులపై చట్టపరమైన చర్యలు తీసుకొని వారి స్వస్థలాలకు తిప్పి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం దోమ మండల బీజేపి అధ్య క్షుడు బొంగు మల్లేశ్ ఆధ్వర్యంలో డిప్యూటి తహసీల్దార్ నర్సింహులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్యాట అశోక్ కుమార్, దోమ నర్సిములు, బాబు, శివకుమార్, సంతోష్ నాయక్, హరీష్, గణేశ్, వెంకటయ్య, సత్యం పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వ భూమిని కాపాడండి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, మే 6 : మండల పరిధిలోని సాలిండాపూర్ గ్రామంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించాలని తహసీల్దార్ పద్మావతికి ప్రజాసంఘాల నాయకులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందించారు. బీడు,గుట్టలు ఉన్న భూమిని తాము కొనుగోలు చేశామని జేసీబీతో చదును చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వాస్తవాలు నిగ్గుతేలే వరకు ఆ భూమి జోలికి ఎవ్వరు కూడా వెళ్లరాదన్నారు. అక్కడ జరుగుతున్న పనులను ఆపకపోతే ప్రజాసంఘాలు, గ్రామప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మొగులప్ప, రమేశ్, శ్రీను, వెంకటేశ్, చందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన

మిషన్ భగీరథ పనులను చూస్తున్న ప్రత్యేకాధికారి

బషీరాబాద్, మే 6 : మండల పరిధిలోని మైల్వార్ గ్రామ పంచాయతీని మంగళవారం ప్రత్యేకాధికారి, తహసీల్దార్ వెంకటేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ రికార్డులు, మిషన్ భగీరథ పనులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించి పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా నీళ్లు రెండు పూటలు పట్టించాలని సూచించారు. అలాగే ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేయించాలన్నారు. కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. మొక్కలను గ్రేడింగ్ చేయించాలని ఆదేశించారు. వర్షకాలం వరకు అన్ని రకాల మొక్కలను నాటేందుకు సిద్ధం చేయించాలన్నారు.

రైల్వేను ప్రైవేటీకరించొద్దు

రైల్వే స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

వికారాబాద్, మే 6: రైల్వే ప్రమాదాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ రైల్వే స్టేషన్ వద్ద సీపీఎం, సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే రంగంలో ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. దేశంలో ఇటీవల కాలంలో వరుసగా అనేక రైలు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రయాణికులు, లోకో పైలెట్లు, ట్రైన్ మేనేజర్లు, ట్రాక్ మెయింటైనర్లు వివిధ రకాల రైల్వే కార్మికులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో చనిపోతున్నారని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రైల్వే వ్యవ స్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరించడానికి ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. కాలం చెల్లిన రైల్వే సిగ్నల్ వ్యవస్థను , ట్రాక్ సిస్టంను పునరుద్ధరించాలని సూ చించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు యాదయ్య , దశరథ్, నర్సిం హులు, శ్రీనివాస్, మల్లేశ్, జంగయ్య, రాములు, షబీర్, జహంగీర్, రహీం, రవి కుమార్, వెంకట్, అశోక్ పాల్గొన్నారు .

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కులకచర్ల, మే 6: రాష్ట్రంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అవుతున్నా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కావడం లేదని పీఎస్‌హెచ్ఎంఎ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు తుప్పలి ఆనంద్‌కుమార్ అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో చూసి ఈ ప్రభుత్వం వస్తే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించారని అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చింది కొంత సమయం ఇవ్వండి అని సీఎం అడిగినందుకు వేచి చూశారని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులతో ఎప్పుడు కావాలంటే అప్పుడు సీఎం కలువడం, కొంచెం సమయం ఇవ్వండి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడం ఈ విషయాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులు నమ్మడం జరిగిందని తెలిపారు. దీంతో చాలాకాలంగా ఇబ్బందికరంగా ఉన్నా సహనం వహించామన్నారు. 2025 మార్చి వరకు ఆర్థికేతర సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కాని ఇప్పటివరకు పరిష్కరించక ప్రతి ఉద్యోగి నెలకు 10వేల నుంచి 15వేల వరకు నష్టపోతున్నారని తెలిపారు.

బాల్యవివాహాలు జరిపిస్తే చట్టపరంగా చర్యలు

తాండూరు రూరల్, మే 6: బాల్యవివాహాలు జరిపిస్తే చట్టపరంగా చర్యలుంటాయని తాండూరు సీడీపీవో శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో మంగళవారం అన్నారు. 18 ఏండ్లు నిండకుండా తల్లిదండ్రులు బాలికలకు వివాహం జరిపిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మగవారికి 21 ఏండ్లు నిండి ఉండాలని తెలిపారు. ప్రత్యేక్షంగా కానీ, పరోక్షంగా కానీ వివాహాలకు సహకరిస్తే వారిపై కూడా చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు.

ధారూరు, మే 6: పిల్లలు తల్లిదండ్రులను చిన్నప్పటి నుంచే గౌరవించే విధంగా నేర్పించాలని శ్రీ సత్యసాయిసేవా సంస్థల మహిళ రాష్ట్ర సమన్వయకర్త మాధవీలత అన్నారు. మంగళవారం ధారూరు మండల పరిధిలోని కెరెళ్లి గ్రామంలోని సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రంలో నిర్వహించారు.ఈ సందర్భంగా బాలవికాస్ విద్యార్థుల మాతృపూజా కార్యక్రమం, సత్యసాయి సామూహిక వ్రతాలు నిర్వహించారు. అనంతరం మహిళలకు 45రోజుల పాటు జరిగే కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం అధ్యక్షుడు రఘునందన్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కోశాధికారి వెంకట్‌రామిరెడ్డి, జిల్లా యువ సమన్వయ కర్తలు బసవేశ్వర్, దివ్యావాణి, మాదారం కన్వీనర్ నాగరాజు ఉన్నారు.

బహిరంగ ప్రకటన
తేది:07-05-2025
ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయినా శ్రీమతి పి.కేశవలత భర్త కృష్ణ గౌడ్, వయస్సు: 43 సం॥లు, వృత్తి: గృహిణి నివాసము ఇం.నెం.44-382, తిరుమల నగర్, మౌలాలి, హైదరాబాద్ గారికి, ఫరూఖ్‌నగర్ గ్రామ శివారులో షాద్‌నగర్ మున్సిపాలిటీ సర్వే నెం.28/Pలో ప్లాట్ నెంబర్ 43/A యొక్క బిస్త్రీదము 150 చదరపు గజములు గల ప్లాటు విక్రయ దస్తావేజు నెంబరు 1858/2000, 4374/2000 ద్వారా నా క్లయింట్ పేరిట రిజిష్టర్ కాబడి ఉన్నది. ఇట్టి ప్లాటుకు హద్దులు ఉత్తరము: ప్లాట్ నెం. 43, దక్షిణము: ప్లాట్ నెం.43/B, తూర్పు : 33 ఫీట్ల వెడల్పు రోడ్డు పడమర: ప్లాట్ నెంబర్ 37/A కలవు. ఇట్టి ప్లాటుకు సంబంధించి సర్వహక్కులు మా క్లయింట్‌కే కలవు. కావున ఎవరైనా ఇట్టి ప్లాటులోకి అక్రమంగా ప్రవేశించినా ఇట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.
E. NARSIMULU B.Com., LL.B.,(OSM)
C. SRINIVAS MURTHY
Advocates / Notary
H.No.13-337, Christian Colony, Shadnagar Town, Ranga Reddy Dist., T.S.
Cell: 9948109680

రెవెన్యూ సదస్సులో 24 ఫిర్యాదులు



అంపల్లి గ్రామ రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

ధారూరు మే 6: మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సుకు మొత్తం 24 ఫిర్యాదులు వచ్చినట్లు ధారూరు తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. మంగళవారం ధారూరు మండల పరిధిలోని అంపల్లి, క్యాచారం గ్రామాలలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అంపల్లి రెవెన్యూ సదస్సులో 14 ఫిర్యాదులు, క్యాచారం గ్రామ రెవెన్యూ సదస్సులో 10 ఫిర్యాదులు వచ్చాయి. బుధవారం మండల పరిధిలోని అల్లాపూర్, అల్లీపూర్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధారూరు, కోట్ పల్లి తహసీల్దార్లు సాజిదా బేగం, శ్రీనివాస్, డిప్యూటి తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది రైతులు ప్రజలు తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్, మే 6 : ప్రభుత్వ ప్రైవేట్ డీఈఎల్ఈడీ కళాశాలలో 2025-27 రెండు సంవత్సరాల కోర్సు తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ, మీడియాలలో చేరడానికి తేదీ 24-03-2025 నుండి 15-05-2025 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించుకోవాలని వికారాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేది 25-05-2025 నాడు కంప్యూ టర్ బేస్ (ఆన్లైన్‌మోడ్) ద్వారా నిర్వహించ బడుతుందన్నారు. ఎంట్రెన్స్ హాజరు అగుటకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత వోసీ, డీసీ అభ్యర్థులు 50% మా ర్కులతో, ఎస్సీ,ఎస్టీ, పీహెచ్‌సీ అభ్య ర్థులు 45% మార్కులతో ఉత్తీర్ణత అయినవారు తేదీ 1-07-2025 నా టికి 17 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం http:// deecet.cdse. telangana.gov.in వెబ్ సైట్ లలోచూడాలని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962